క్లుప్తంగా...

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

అల్వాల్: అల్వాల్ హిల్స్‌లోని శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో పంచమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా గురువారం స్వామివారికి ప్రత్యేక హోమాలు, మూలమంత్ర హోమం, నిత్య పూర్ణాహుతి, ఆరగింపు, విద్యార్థి కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం రోజు వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ కాంతారావు, కే.నర్సింగ్‌రావు, శ్రీధర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సోయం బాపూరావును బర్తరఫ్ చేయాలి

ఉప్పల్: ఆదిలాబాద్‌లో మత ఘర్షణలను ప్రేరేపించే విధంగా క్రైస్తవ గిరిజనులకు గుండు కొట్టించి ఘర్ వాపసీతో బుద్ధిచెప్పి, రిజర్వేషన్లను రద్దు చేస్తామంటూ క్రైస్తవులను బెదిరించిన ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావును ఎంపీ పదవీ నుంచి బర్తరఫ్ చేయాలని తెలంగాణ పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజ్యాంగ వ్యతిరేక వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ సోయం బాబురావును తక్షణమే అరెస్టు చేయాలని తెలంగాణ పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రెవ టీఆర్ రాజు, బిషప్, శామ్యూల్, క్రిస్టియన్ జర్నలిస్ట్ ఫోరం రెవ కేఎస్ ప్రకాష్‌రావు, క్రైస్తవ ధర్మ ప్రచారం పరిరక్షణ సమితి అధ్యక్షులు జెరుసలెం మత్తయ్య డిమాండ్ చేశారు.

వైభవంగా బ్రహ్మోత్సవాల ముగింపు



బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని శ్రీనిమిషాంబికాదేవి ఆలయ 17వ బ్రహ్మోత్సవ ముగింపు వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఆవాహిత దేవతా హోమం, బలిప్రదానం పూర్ణాహుతి, కలశ ఉద్వాసన కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే అమ్మవారికి పంచామృత, 56 రకాల పండ్ల రసాలతో, సుగంధ ద్రవ్యాలతో నిజాభిషేకం, విశేష అలంకరణ, పంచ హారతులు, నీరాజనం, మంత్రపుష్పం, వేద ఆశీర్వచనం, రుత్విక సన్మానం, పల్లకీ సేవ, సామూహిక ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్, కోశాధికారి రమేష్, ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ శర్మ మహిళలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయం 'డబుల్' ఇళ్లు



బోడుప్పల్: చెంగిచర్లలోని డబుల్ బెడ్ రూం ఇళ్లు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయని బీజేపీ బోడుప్పల్ ప్రధాన కార్యదర్శి ఏర్పుల మహేష్ అన్నారు. గురువారం చెంగిచర్లలోని డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద ప్రజల కోసం నిర్మించిన ఇళ్లు వారికి కేటాయించకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. అర్హులైన పేద ప్రజలు చాలామంది ఉన్నారని, అవి వారికి కేటాయించి ఇవ్వాలని కోరారు. నిర్మించిన ఇళ్లకు ఆలనా పాలనా లేకపోవడంతో కిటికీల అద్దాలు, తలుపులు పగల గొడుతున్నారని, గోడలు బూజు పట్టి ఉన్నాయని, రాత్రి వేళలో మందుబాబులు అసాంఘిక కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి లబ్ధిదారులకు కేటాయించాలని, లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

నేటినుంచి మల్లికార్జున స్వామి వార్షిక ఉత్సవాలు

గౌతంనగర్: చారిత్రాత్మిక మల్లికార్జునగర్‌లోని మల్లన్న ఆలయంలో స్వామివారి 26వ వార్షికోత్సవ వేడుకులు శుక్రవారం నుంచి భక్తిశ్రద్ధలతో ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి గణపతి పూజ, పుణ్యహవచనం, ద్వాజారోహనం, మండపారాధన, రుద్రాభిషేకం, మహా హారతి, తీర్థప్రసాద వితరణతోపాటు సాయంత్రం 6:30 గంటలకు మండపారాధన, మహా హారతి, శనివారం ఉదయం నుంచి రుద్రహోమం, అభిషేకం, శాంతి కల్యాణం అన్నదానం ఉంటుందని తెలిపారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి



కాశీపురంలో కుళాయిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని కాశీపురంలో రూ.45 లక్షలతో నిర్మించతలపెట్టిన తాగునీటి సరఫరా పనులు, మధురానగర్‌లో రూ.25 లక్షలతో నిర్మించనున్న అంతర్గత రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ జితేంద్రనాథ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్కాజిగిరి నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో తాగునీటి సమస్య లేకుండా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జలమండలి జీఎం సునీల్‌కుమార్, జలమండలి అధికారులు సాంబయ్య, రమేష్, కాలనీ వాసులు మన్మథరెడ్డి, తిరుపతిరెడ్డి, రమేష్, మైపాల్ రావు, శ్రీనివాస్, ప్రభాకర్, రంగరాజు, వీరయ్య, నాయకులు బొబ్బిలి సురేందర్ రెడ్డి, వీవీరావు, శ్రీశైలంయాదవ్, బలవంత్ రెడ్డి, నాగేశ్వరరావు, పరమేష్ పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సామాజిక న్యాయం

మల్కాజిగిరి: సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం ప్రభుత్వం ముందంజలో ఉందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో 372 మందికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, 15 మందికి 58, 59 జీవో ద్వారా మంజూరైన పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోనే అన్ని వర్గాలకు సామాజిక న్యాయం చేస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. దశాబ్దకాలంలో ప్రజల మన్ననలను చూరగొన్న ప్రభుత్వాన్ని ప్రజలు మరొక్కమారు దీవించాలన్నారు. దశాబ్ది ఉత్సవాలను ఈ నెల 22 వరకు జరిగే ఉత్సవాలను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, రాజ్యలక్ష్మి, సబితాకిషోర్, జితేంద్రనాథ్, మల్కాజిగిరి తాహసీల్దార్ వెంకటేశ్వర్లు, అల్వాల్ డీటీ రేణుక, ఆర్ఐలు శ్రీశైలం, రమేష్, వినీత, రేణుక, యాదగిరి, నాయకులు జీఎన్వీ సతీష్‌కుమార్, పిట్టల శ్రీనివాస్, గుండానిరంజన్, కన్న తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రం దేశానికే మోడల్

– ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే మోడల్‌గా నిలుస్తోందని, తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను ఉప్పల్ నియోజకవర్గంలో వైభవంగా జరుపుకుందామని ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. గురువారం హబ్సిగూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలపై బీఆర్ఎస్ నియోజకవర్గ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్యనాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే రోజువారి కార్యక్రమాలను వివరించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదో సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ఉత్సవాలను పండగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ప్రతినిత్యం కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, కార్పొరేటర్లు స్వర్ణరాజ్, శ్రీదేవి, దేవేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ధన్‌పాల్‌రెడ్డి, నాయకులు గద్దం రవికుమార్, సాయిజెనోఖర్, ప్రవీణ్‌ముదిరాజ్, మహేందర్‌రెడ్డి, గిరిబాబు, ముత్యంరెడ్డి, నర్సింగ్‌రావు, డాక్టర్ బీవీ.చారి, ముస్తాక్, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ కీర్తిని చాటిచెప్పేలా..



మాట్లాడుతున్న మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు పీర్జాదిగూడ సిద్ధమైంది. తెలంగాణ కీర్తిని చాటిచెప్పేలా దశాబ్ది ఉత్సవాలు నేటినుంచి ఈ నెల 22 వరకు వైభవంగా నిర్వహించేందుకు నగరం సిద్ధమైనట్లు మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి తెలిపారు. గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఉత్సవాల నిర్వహణపై సభ్యుల అభిప్రాయాలు, సలహాలు తీసుకున్నట్లు విలేకరుల సమావేశంలో మేయర్ వెల్లడించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, పలువురు కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ, మున్సిపల్ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులను గౌరవించాలి

అల్వాల్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో తెలంగాణ ఉద్యమకారుల్ని గౌరవించాలని, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ చీమ శ్రీనివాస్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ నాయకుడిగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఉద్యమ సమయంలో చిన్న చిన్న ఉద్యోగాలు, వ్యాపారాలు వదిలి రాష్ట్ర సాధనే ధ్యేయంగా ఉద్యమకారులు పనిచేశారన్నారు. కానీ నేడు వారి జీవితాలు గడవడం కూడా కష్టంగా మారిందని, వారు గుర్తింపునకు నోచుకోకుండా ఆత్మగౌరవం లేకుండా జీవిస్తున్నారన్నారు. రాష్ట్రం ఏర్పడి 10 సంవత్సరాలు కావస్తున్నా తెలంగాణ ఉద్యమకారులు నిర్లక్ష్యానికి గురవుతున్నారన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. అన్ని రంగాల్లో సీమాంధ్ర కార్పొరేట్ వర్గాల పెత్తనాన్ని నిర్మూలించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం ప్రతినిధులు సురేందర్‌రెడ్డి, ఇందిరాకుమార్, సుదర్శన్, వీరాస్వామి, నరేందర్‌గౌడ్, విష్ణువర్ధన్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న సంఘం ప్రతినిధులు

పేదల స్థలాలను క్రమబద్ధీకరించాలని వినతి

కుషాయిగూడ: జీవో 59 కింద దరఖాస్తు చేసుకున్న పేదల స్థలాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే ఉప్పల్ నియోజకవర్గ వ్యాప్తంగా 30 నోటిఫైడ్ కాలనీలకు చెందిన పేదలు క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నారని, ఇంకా చేసుకోవాల్సిన వారు కూడా ఉన్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అయితే దరఖాస్తు చేసుకున్నవారికి, కొత్తగా దరఖాస్తు చేసుకునే పేదలందరి స్థలాలకు ప్రభుత్వ విలువలో 10 శాతం చెల్లించుకొని క్రమబద్ధీకరించాలని కలెక్టర్‌ను ఆయన కోరినట్లు తెలిపారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి పేదలకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్ ముదిరాజ్, గంధం నాగేశ్వరరావు, వంజరి ప్రవీణ్ తదితరులు ఉన్నారు.



సుద్ధకుంట పరిసర ప్రాంతాల్లో దుర్వాసన



సుద్ధకుంట ప్రాంతాన్ని పరిశీలిస్తున్న శేఖర్‌రెడ్డి

బోడుప్పల్: 8వ డివిజన్ పరిధిలోని సుద్ధకుంట పరిసర ప్రాంతంలో కెమికల్ వాటర్, వ్యర్థాలు నిండిపోయి విపరీతమైన దుర్వాసన వస్తోంది. స్థానిక కాలనీ ప్రజలు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ద్వారకానగర్ కాలనీ అధ్యక్షులు మోదుగు శేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారు. ఇదే విషయమై బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, డీఈఈ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. దీంతో అధికారులు, మేయర్ స్పందించి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గురువారం జేసీబీతో సుద్ధకుంట పరిసర ప్రాంతంలో పేరుకు పోయిన చెత్త చెదారాన్ని, వ్యర్థాలను తొలగించి, ఎగువ ప్రాంతం నుంచి వచ్చే మురుగనీటిని దిగువ ప్రాంతానికి వెళ్లేలా కాల్వగా తీస్తున్నట్లు శేఖర్‌రెడ్డి వెల్లడించారు. ఈ పనులు మరో మూడు రోజుల పాటు జరుగుతాయని, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పనులు చేపట్టినట్లు తెలిపారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



వేసవి నృత్య శిక్షణ ముగింపులో ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

గౌతంనగర్: విద్యార్థులు చదువుతోపాటు సంప్రదాయ కళలకు జీవం పోస్తూ కూచిపూడి నృత్యంలో ప్రావీణ్యం చాటడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ తొలి స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. పెండాయల నృత్య భారతి అకాడమి ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ కల్చరల్, అకాడమి డైరెక్టర్, కేంద్ర సంగీత, నాటక అకాడమి సభ్యురాలు కూచిపూడి నృత్య గురువు డాక్టర్ ఎస్‌పి. భారతి ఆధ్వర్యంలో నెల రోజులుగా నిర్వహించిన వేసవి నృత్య శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం బుధవారం రాత్రి జ్యోతినగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ తీసుకున్న విద్యార్థులు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్పొరేటర్ మేకల సునీతయాదవ్, రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణ, కథక్ నృత్య గురువు మంగళ భట్, రాఘవరాజ్ భట్, సినీ గీత రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ, జ్యోతినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు మనోజ్‌కుమార్, ప్రొ.సుదర్శన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో వాచ్‌మెన్ మృతి

కుషాయిగూడ: నిర్మాణంలో ఉన్న భవనం వద్ద కాపలాదారుడిగా ఉన్న వాచ్‌మెన్ పాముకాటుతో మృతిచెందిన ఘటన గురువారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం, వీరారెడ్డిపల్లికి చెందిన కొంతం మల్లేష్(45) క్రితం నగరానికి వలస వచ్చి కుషాయిగూడ, సోనియాగాంధీనగర్‌లో నివాసం ఉంటూ కూలిపని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే సోనియాగాంధీనగర్ కాలనీలో నిర్మాణం జరుగుతున్న శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి ఇంటి వద్ద మల్లేష్ 5 నెలలుగా వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం పాము కాటువేసింది. కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకొని అపస్మారకస్థితిలో ఉన్న మల్లేష్‌ను స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉపేందర్‌యాదవ్ పేర్కొన్నారు.

అవగాహన ర్యాలీ

మల్కాజిగిరి: సంపూర్ణ సురక్ష హెచ్ఐవీ/ఎయిడ్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరిలో శ్రీసాయి మహిళా సంఘం ఆధ్వర్యంలో ఇందిరాభవన్ నుంచి అనుటెక్స్ వరకు పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శానిటరీ సూపర్‌వైజర్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ సంపూర్ణ సురక్షితం కాదు అనుకుంటే ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏలు గిరి, బాలామణితో పాటు అజయ్ సింహ పాల్గొన్నారు.